# నాకీ పెళ్ళి వద్దు

"అన్నయ్యా!"

గదిలో కుర్చీలో కూర్చుని పెళ్ళిజాబితా రాసుకుంటున్న సుధాకరం క్షణంసేపు వెనక్కి తిరిగి చూసి "నువ్వా-రా" అంటూ మళ్ళీ రాసుకోవటంలో మునిగిపోయాడు.

సుజాత మెల్లగా వచ్చి అన్నగారు కూర్చున్న కుర్చీ వెనక నిలబడింది.

'ఏమిటమ్మా" కొద్దిసేపయిం తర్వాత తన వెనక నిశ్శబ్దంగా నిలబడిపోయిన చెల్లెలు గుర్తొచ్చి అడిగాడు.

"అన్నయ్యా!...." సుజాత పెదవులు అస్పష్టంగా కదిలి కూర్చున్నాయి.

"నీ స్నేహితురాళ్ళందరికీ ఉత్తరాలు రాశావా ? శుభలేఖలు పంపటంలో నేనెవర్ని మర్చిపోలేదుగదా" జాబితాలో ఏదో వస్తువు గుర్తువచ్చిన సుధాకరం మళ్ళీ చటుక్కున వంగి రాస్తూ అన్నాడు.మళ్ళీ ఐదు నిమిషాలు గడిచిపోయినాయి. సుజాత అన్నగారు రాస్తున్న లిస్టువంక చూస్తూ నిలబడిపోయింది.

"ఆ! మర్చిపోయాను. నీకే రంగు యిష్టమో చెప్పు. చీరెలు పంపమని షావుకారికి కబురు పంపాలి." హఠాత్తుగా గుర్తొచ్చిన సుధాకరం ఆగిపోయి తలెత్తుతూ అన్నాడు.

"నాకీ పెళ్ళివద్దు, వద్దన్నయ్యా!" చాలా సేపటినుంచి ఎదురు చూస్తున్న సుజాత ఎలాగో అనేసింది.

"వద్దా?" తెల్లబోతూ చేతిలో పెన్ డ్రాయరుమీద పెట్టేస్తూ అన్నాడు.

"అవును. నిజం. ఎలాగయినా ఈ పెళ్ళి ఆపుజెయ్యి."

సుజాత మాటలకంటె ముందుగా మొహం ఎర్రబడి పోయింది. అంతకంటె ముందుగా కళ్ళు వాల్చేసుకుని బొమ్మలా నిలబడిపోయిన చెల్లెలివంక ప్రశ్నార్థకంగా చూశాడు. అతని కనుబొమలు ముడిపడ్డాయి. ఎడంచేయి చాచి చెల్లెలి చేతిని ముందుకి లాగుతూ "ఎందువల్ల? అతడు నీకు నచ్చలేదా!" అన్నాడు. వరుడు నచ్చటం విషయంలో యెవరికీ అనుమానం లేదు. అందుకే అతను మాటవరసకికూడా చెల్లెల్ని అడగలేదు. ఓవిధంగా ఈ సంబంధం తమ స్థితికీ ఊహకీ మించింది.

సుధాకరం మాటలకి అది కాదన్నట్లు తల అడ్డంగా వూపింది.

"మరి?" ఏమడగాలో అతనికి అర్థంకావడంలేదు.

సుజాత చెప్పటంలేదు.

"ఎందువల్లో చెప్పకపోతే నాకెలా తెలుస్తుంది? ఫలానా కారణం అంటూ వుండాలిగా? ఇన్ని ప్రయత్నాలు చేసుకుని, తాంబూలాలు పుచ్చుకుని లగ్నం నిర్ణయించుకున్నాక యిప్పుడు - అసలే" అర్థోక్తిలో ఆగిపోయాడు సుధాకరం.

"నేనప్పుడే చెప్పాలనుకున్నాను. కాని నువ్వుగాని, వదినగాని, అసలు సందే యివ్వలేదు. నాకీపెళ్ళివద్దు, నాకిష్టంలేదు. అత్తయ్య తిట్లు-శాపనార్థాలునువ్వుమర్చిపోయినా నేను మర్చిపోలేదు."గబగబాఅనేసి గిరుక్కున వెనకనుంచి అన్నగారు పిలుస్తున్నా లక్ష్యపెట్టకుండా వెళ్ళిపోయింది.

చెల్లెలు వెళ్ళిపోయిన దిక్కే అచేతనంగా చూస్తూ కూర్చుండిపోయాడు సుధాకరం. అంతకుముందు ఎంతో ఉత్సాహంతో కూర్చుని రాస్తున్న జాబితా హఠాత్తుగా అతనికి విసుగ్గా అన్పించింది. సుజాతకి ఈ పెళ్ళి నిజంగా ఇష్టంలేదేమో! ఆ లేత మనసులోంచి మధు బొమ్మ ఇంకా చెరిగిపోలేదేమో! ఇష్ట లేని పెళ్ళిచేసి సుజాతతోపాటు మరీ ముక్కూ మొహం తెలియని వ్యక్తిని బాధపెట్టడం దేనికి?హఠాత్తుగా అతనిలో నీరసం ప్రవేశించింది. జాబితా కాగితాన్ని మడిచి పుస్తకంలో పెట్టేసి లేచి లోపలకు వెళ్ళాడు.

లోపల పెళ్ళితాలూకు పనిమీద హడావుడిగా అటుయిటు తిరుగుతోంది శాంత.శాంత కసలు బుద్ధిలేదు.తనేదో పనిలోవుండి సుజాత అభి

ప్రాయం తెలుసుకోవటానికి వీల్లేకపోవచ్చుకానిశాంతకేమైందిః "శాంతాః" గుమ్మం బయటనుంచి కొంచెం కటువుగా వచ్చిన పిలుపుకి ఎవరితోనో మాట్లాడుతూ ఏదో పనిచేస్తున్న శాంత తలెత్తి చూసింది. సుధాకరం కను బొమలు ఇంకా ముడిపడేఉన్నాయి. ఏదోచికాకు కలిగితేతప్ప అవి అలా ముడుచుకోవు. "ఏమిటిః" అంటూ శాంత యివతలకు వచ్చింది. "ఇలారా" గదిలోకి" దారితీస్తూ పిల్చాడు.

శాంత భర్తవెంటే లోపలికి వచ్చింది. "సుజాత పెళ్ళివద్దంటుంది ఏమిటిః" భార్య మొహంలోకి సూటిగా చూస్తూ అడిగాడు. శాంత కళ్ళు కాసేపు తెల్లబోయినట్టు భర్త ముఖంలోకి చూసినాయి.

"ఎందువల్ల అలా అంటోందిః నిజంగా ఇష్టంలేకపోతే ఈ పెళ్ళి జరిగిమటుకు ప్రయోజనం ఏమిటిః అసలెందుకు వద్దంటుందిః"

"మీరడగలేకపోయారాః" అతని కర్థంకాని విషయాలు భార్య మీదకు నెట్టటం సుధాకరానికి అలవాటే.

"అడిగాను. అత్తయ్య తిట్లు, శాపనార్థాలు నువ్వు మర్చిపోయినా నేను మర్చిపోలేదంటోంది. అంతేనాః లేక...." భార్యవంక చూస్తూ ఆగి పోయాడు.

"ఇంకేం మరిః తనకసలు పెళ్ళికాదని, అయినా అది సవ్యంగా ముగించదని తనలో ఓ అభిప్రాయం ఏర్పడినట్లుంది ఇదివరకు ఒకటి రెండుసార్లు నాతో అంది గూడా."

"అంతేనా అనిః"

"అంతకంటేకారణం:నాకుకన్పించలేదు.అయినాకనుక్కుంటాను"

శాంత వెళ్ళిపోయింది. కారణం అదేఅయితే ఫర్వాలేదు. జీవితంలో అనుకోకుండా దెబ్బతిన్న వాళ్ళకి ఆ పిరికితనం తప్పకుండా వస్తుంది. సుధాకరం మళ్ళీ లిస్టు తయారు చెయ్యటంలో మునిగిపోయాడు.

ఆ రాత్రి పడుకోబోతుండగా "కారణం అదే. అంతకంటే ఏం లేదు. మీరు ఖంగారుపడకండి, చచ్చిపోయిన మధుకంటే మేనత్త తిట్లు ఆ అమ్మాయిమీద ఎక్కువగా పనిచేశాయి-అంతే!" అంది శాంత.

"అంతే కదాః" సుధాకరం నిట్టూర్పు విడిచాడు. సుజాత అతనికి ఒక్కగానొక్క చెల్లెలు. ఆ అమ్మాయి సంతోషంకోసం, సుఖం కోసం

తనేదైనా చెయ్యగలడు. "ఏదయినా నువ్వు దానికి ధైర్యంచెప్పు. అసలే ఒట్టి పిరికిది. ఏవేవో ఊహించుకొని ఖంగారుపడిపోతుంది." ప్రక్కకు ఒత్తిగిలి పడుకుంటూ అన్నాడు, రేపు తనుగూడా సుజాతకీవిషయంమీద కాస్త ధైర్యం చెప్పాలి అనుకుంటూ.

సుధాకరంగదిలో పెద్దలైటు తగ్గి బెడ్‌లైటు వెలగడం తనగదిలో కిటికీ దగ్గర నిలబడ్డ సుజాత గమనిస్తూనే వుంది. ఇల్లంతా నిశ్శబ్దం ఆవరించుకుంది. నిద్రలో లేచి ఏడుస్తున్న బాలుని శాంత జోకొట్టింది. బైట పిండారబోసినట్లున్న వెన్నెల్లో సర్వప్రపంచం సుఖశాంతులతో విలసిల్లుతున్నట్లుగా ప్రశాంతంగా నిశ్శబ్దంగా వుంది. కావాలని ఎంత ప్రయత్నం చేసినా నిద్రరావటంలేదు. తనెలాగో అన్నయ్యకి చెప్పేసింది. చెప్పకపోతే యెలా? ఈ పెళ్ళి ఆగిపోగానే తన కసలు పెళ్ళివద్దని, సంబంధాలే చూడవద్దనీ అన్నయ్యకు గట్టిగా చెప్పాలి. ఆరోజు-బావతో తన పెళ్ళి కోసం లగ్నం పెట్టినప్పుడు-తనని పెళ్ళికూతురు చేసిన రోజున దురదృష్టవంతురాలిని అని జీవితం నుదుటిమీద గీసిన యెర్రటి గీతని ఎవరుమర్చిపోయినా తనెలా మర్చిపోగలుగుతుంది?

అసలు మొట్టమొదట్లో టైఫాయిడ్ జ్వరంతో తీసుకుంటూ చావు బ్రతుకులమీదున్న తండ్రిని తన మేనత్త విశాలక్ష్మమ్మగారు చూడటానికి రావటంతో అసలు కథ ప్రారంభమయిందని చెప్పొచ్చు. అంతకుముందు యెవరూ సుజాతని మధుభార్యగా ఏదో ఒకటి రెండుసార్లు తమాషాగా తప్ప అనుకోలేదు ప్రసాదరావుగారికి కూతురూ కొడుకు యిద్దరూ రెండు కళ్ళు, సుధాకరం బి.ఎ. పూర్తిచేసి ఆర్థిక పరిస్థితులవల్ల పై చదువుల కెళ్ళలేక బి.ఇడి. పాసయి, వున్న ఊళ్ళో బెజవాడలోనే స్కూలు టీచర్‌గా జీవితానికి బాట వేసుకున్నాడు. సుధాకరం కుటుంబానికి తగ్గ ఫాయాలోంచే వచ్చిన శాంత ఆ కుటుంబంలో వ్యక్తిగా కలిసిపోయింది. కూతురికి మటుకు ఎలాగైనా మంచి సంబంధం తీసుకురావాలని ప్రసాదరావుగారు కలలు కనేవారు.

అనుకోకుండా విషజ్వరం మహమ్మారిలా వచ్చి ఆయననెత్తికెక్కి కూర్చోవటంతో ఇష్టంలేకపోయినా ఈ లోకంలోనుంచి వెళ్ళిపోటానికి సిద్ధపడక తప్పలేదు. తన పరిస్థితి గమనించుకునే గుంటూరునుంచి

చెల్లెల్ని వెంటనే రమ్మనమని ఉత్తరం రాశాడు. ఏ అవసరం వచ్చినా వెంటనే వచ్చి అన్నగారిని ఆదుకునే విశాలక్ష్మమ్మగారు ఉత్తరం చూడ గానే బయలుదేరి వచ్చింది.

"బ్రతుకుతాననే ఆశలేదు విశాలా! సుజాతని యేం చేసి పోవాలో తోచటంలేదు!" కళ్ళంబడి నీళ్ళు పెట్టుకుంటూ అన్నారాయన చెల్లెలితో.

ఇదేమిటి? చెట్టంత కొడుకుని కళ్ళెదుట పెట్టుకుని ఇలా మాట్లాడ తాడు! విశాలాక్ష్మమ్మగారికి అది నచ్చలేదు. పోనీ, మధుకు చేసుకోమని మనసులో వుంటే అది పైకి చెప్పచ్చుగా! అన్నగారి నోటినుంచే అది వినాలనుకున్న ఆవిడకూడా ముభావంగా వుంది. అదీగాకుండా పుట్టగానే తల్లిని పోగొట్టుకున్న సుజాతంటే ఆవిడకు సదభిప్రాయంలేదు. చివరికి రెండు రోజుల్లో మృత్యుముఖంలోకి వెళ్ళిపోతాననగా ప్రసాదరావుగారు ఆ విషయం యెత్తాడు.

"చూద్దాంలే అన్నయ్యా! దానికోసం నువ్వు బెంగపెట్టుకోకు!" అన్నారావిడ.

"సుధాకరం పసివాడే తల్లీ! కాస్త నువ్వు దయతల్చకపోతే వాడా బరువు ఎత్తలేడు. వెనుక ఆస్తిపాస్తులేం లేవు. రెక్కలుతప్ప వాడికి ఏమీ యివ్వలేకపోయాను!" దుఃఖంతో ప్రసాదరావుగారి గొంతు బొంగురు పోయింది.

"అవిచ్చావు. చాలదూ? దిగులుపడకని చెపుతున్నానుగా. నువ్వ నుకోలేదుగాని, లేకపోతే ఈ నాటికి వాళ్ళిద్దరి పెళ్ళి యెప్పుడో అయి పోయేది. నాకుమటుకు యెవరున్నారు?" అంది. అందులో "నువ్విదివరకు మధుని కాదని సంబంధాలు చూశావు. ఇప్పుడు వాడే కావల్సివచ్చాడు" అనే యెత్తిపొడుపుంది.

చివరికి ఏ నిర్ణయం నిశ్చయం గాకుండానే ప్రసాదరావుగారు పోయారు. ఆపదిరోజులూ ఉండి విశాలక్ష్మమ్మగారు వెళ్ళిపోయారు. వెళ్ళే ముందు సుధాకరం పెళ్ళిసంగతి యెత్తబోతే "నాన్న సంవత్సరీకాలు కానివ్వు, ఇప్పుడు తొందరేమి"టని ఆవిడ వెళ్ళిపోయింది.

సంవత్సరం యిట్టే తిరిగిపోయింది. విశాలక్ష్మమ్మగారి పరిస్థితికూడ మారిపోయింది. అనుకోకుండా కలప వ్యాపారంలో పెట్టిందానికి రెట్టింపు లాభాలు వచ్చాయి. డబ్బెప్పుడూ సాధారణంగా వూరికే రాదు. హోదాని, పరువు ప్రతిష్ఠల్ని వెంటబెట్టుకుని మరీ వస్తుంది. విశాలాక్షమ్మగారి పనీ అంతే అయింది. డబ్బుతోపాటు వ్యాపారం పెద్దదయింది. పరిచయాలు పెరిగాయి. సంఘంలో మంచిమంచి హోదాగల మనుషులు మిత్రులయ్యారు. కూతుళ్ళున్న కొంతమంది తండ్రులదృష్టి మధుమీదపడటం ఆవిడ గమనించక పోలేదు. కాని మధుకివేవీ పట్టలేదు. మామయ్య పోయినప్పుడు వెళ్ళినప్పటి నుంచీ సుజాతని అతని భార్యగా నిర్ణయం చేసుకున్నాడు. ఈ లాభాలు, హోదాలు, అదృష్టవంతురాలైన సుజాత రాకకి సన్నాహాలు అనుకునేవాడు అదే సుధాకరానికి ఉత్తరంలో రాసేవాడు కూడా, సుధాకరం, విశాలాక్షమ్మగారి మౌనంచూసి జంకినా మధు ఉత్తరాలు నిశ్చింతగా ఉండేటట్లు చేశాయి. మరో ఏడాది గిర్రున తిరిగి పోయింది. ఈ లోపల మధు ఏదో పని పెట్టుకుని అడపా దడపా బెజవాడ వచ్చిపోయేవాడు ఇ ఇంట్లో వివాహం కాకపోయినా మధును యింటి అల్లుడుగానే అందరూ చూసుకునేవారు. సుజాత సరేసరి మధు వచ్చాడని తెలిస్తే చచ్చినా గదిలోంచి బయటికొచ్చేది కాదు. "ఏయ్-అంత సిగ్గయితే యెలా? చూడు. ఆ మూడు ముళ్ళు వేసేసి నీ సిగ్గు నిమిషంలో యెగరగొట్టకపోతే?" ఎప్పుడో అనుకోకుండా కన్పించిన సుజాత చేయి గట్టిగా పట్టుకుంటూ అనేవాడు. మొహం అంతా ఎర్రబడిపోగా సుజాత చేయి లాక్కుని పారిపోయేది.

ఆసారి మధు కోర్కెమీదనే సుధాకరం మేనత్తపేరిట వివాహానికి ముహూర్తం-ఏర్పాటుచేయించటానికి అనుమతికోరుతూ ఉత్తరం రాశాడు. తిరుగు టపాలో విశాలాక్షమ్మగారి దగ్గరనుండి ఘాటుగా సమాధానం వచ్చింది. అందులో మొదట్లో మధుని కాదని సుజాతకి సంబంధాలు వెతికిన విషయాలను గుర్తుచేస్తూ- ఇప్పుడు మధుకి సుజాతకంటె లక్షరెట్లు విలువయిన సంబంధాలు వస్తున్నాయని, ఎలాటి పరిస్థితులలోనూ సుజాత ఆ ఇంటి కోడలు కాలేదనీ, ఏదయినా ఆరిక ఇబ్బందులవల్ల బాధపడుతున్నట్లయితే సుజాత పెళ్ళికి తను సంతోషంగా సాయం చేస్తా

ననీ, మరోసంబంధం చూసుకోమనీ రాసింది. ఉత్తరం చూస్తుండగానే అందులో అక్షరం అక్షరం యిచ్చే అర్థం అవగాహన చేసుకుంటూనే సుధాకర్ మండిపడ్డాడు. రోషంతో అతని నరనరం ఒణికింది. మధు ఇష్టాన్ని గ్రహించాక కాని-లేకపోతే ఏనాడూ తను సుజాతని బలవంతాన కట్టబెట్టాలని అనుకోలేదు. పైగా డబ్బు సాయం చేస్తుందిట, డబ్బు సాయం! తను మరీ అధమస్తపు స్థితిలో లేనని వెళ్ళి చెప్పాలనిపించింది. కానీ ఇందులో మధు అభిప్రాయం తెలుసుకోందే తొందర పడకూడదని నిర్ణయించుకుని తల్లి రాసిన ఉత్తరాన్ని మధు పేర పోస్టు చేశాడు.

ఆ సాయంత్రం కాలేజీనుంచి మామూలుగా కంటె త్వరగా వచ్చేసిన మధు సరాసరి వంటయింటి దగ్గరకి వెళ్ళి "ఈ ఉత్తరం నువ్వురాసిం దేనా అమ్మా?" అని అడిగాడు. క్షణంసేపు అర్థంకాని విశాలాక్షమ్మగారు "ఏఉత్తరం?" అంటూ తీసుకుని కొయ్యబారిపోయింది. సుధాకరం అలాటి పని చేస్తాడనుకోలేదు. అయినా మునిగిపోయిందిలేదు. "అవును, ఏం?" అంది తల్లి తనను సరిచేసుకుంటూ. "ఇంతవరకూ ఏ విషయం లోనూ నా మాట కాదనలేదు. ఇందులోనూ కాదనటం నాకిష్టంలేదు." "సుజాత తప్ప ఇంకెవరూ ఈఇంటికి కోడలుగా రారు, రాలేరు. తర్వాత నీఇష్టం" అని వెళ్ళిపోయాడు. ఆవిడ స్థాణువులా నిలబడిపోయింది.

పది రోజులు గడిచిపోయిన తర్వాత విశాలాక్షమ్మగారు సుధాకరం పేరిట "లగ్నాలు ఇష్టంవచ్చినప్పుడు నిర్ణయించుకోవచ్చనీ పెళ్ళి మధుకి ఏ పద్ధతిలో అంగీకారం ఐతే అదే పద్ధతిలో జరిపించమనీ, ఏ విషయంలోను, తన ప్రసక్తి లేదని, రెండువైపులా పెత్తనం వహించి యిష్టం వచ్చినట్లు చేసుకో"మనీ రాసింది.

సుధాకరం ఆ ఉత్తరం చూసి తెల్లబోయాడు. ఆ యింట్లో విశాలాక్షమ్మగారి విలువ, వ్యక్తిత్వం గ్రహించిన తను అత్తయ్యకి యిష్టం లేనప్పుడు అలా చేసుకోవటం మంచిది కాదనీ. సుజాత వెళ్ళబోయే కుటుంబం భోగభాగ్యాల మాట యెలా ఉన్నా ప్రేమానురాగాలతో ప్రతి వ్యక్తి ఆహ్వానించేటట్లుండాలనీ మధు పేరిట ఈ ఉత్తరం రాశాడు.

మర్నాటి సాయంత్రానికి మధు ఊడిపడ్డాడు. వస్తూనే సుధాకరం మీద విరుచుకుపడ్తూ "నువ్వూ ఏం తక్కువ తినలేదు. అమ్మని మించి

నట్టే ఉన్నావు. మీ ఇద్దర్నీ సర్దలేక, జవాబులు చెప్పలేక నా ప్రాణం పోతోంది. ముందు ఈ పెళ్ళికానీ, తర్వాత అమ్మ సంగతి నేను చూసుకుంటాను. మీ చెల్లెలికేమీ ఫర్వాలేదయ్యా మహానుభావా!" అన్నాడు. సుధాకరం తృప్తిగా నవ్వాడు. లగ్నాలు నిర్ణయించుకున్న తర్వాత మధు వెళ్ళిపోయాడు. ఇందులో మేనమామ తన కసలేం పట్టనట్లు ఎటూ చెప్పలేక పోవటంసుధాకరానికి చాలా బాధ కలిగించింది.

లగ్నం నిర్ణయించటం జరిగింది. తనకు అందినంత వరకూ ప్రతి విషయంలోను మేనత్తని సంతృప్తి పరిచే విధంగా వుండాలనే సుధాకరం ప్రయత్నం చేస్తున్నాడు. తిధి, వార నక్షత్రాలు మంచివని చెప్పి పురోహితుడు పెళ్ళికి నాలుగు రోజులు ముందే సుజాతని పెళ్ళికూతుర్ని చేయించాడు వేడుక చాలా వినోదంగా జరిగింది. శాంతకి పిల్లాడ్ని దగ్గరకు తీసుకునే తీరుబడి గూడాలేదు.

సాయంత్రం అయింది. పెళ్ళికూతురుతోపాటు పేరంటాళ్ళందరికి కూడా శాంత గాజులు వేయిస్తోంది.

"మొదట పెళ్ళికూతుర్ని కానివ్వమ్మా!" అంది పెద్దముత్తయిదు. గాజులబత్తులు సంచిలోపల్లోంచి రంగురంగుల గాజులుతీసి సుజాత చేతికి ఎక్కిస్తున్నారు.

"ఇంద్రధనుస్సులా ఏడురంగులు వచ్చేట్లు వెయ్యి." శాంత పురమాయిస్తోంది.

"అలాగేనమ్మా!" అన్నాడు గాజులబత్తు యెర్రగాజులు తీస్తూ.

వచ్చిన పేరంటాళ్ళందరూ ప్రస్తుతం ఆడపిల్లల గురించి-వాళ్ళకి కాబోయే పెళ్ళిళ్ళ గురించీ-అందులో సాధక బాధకాలగురించీ లోకాభిరామాయణం చెపుతున్నారు.

ఇంతలో వాకిట్లోంచి యెవరో శాంతని పిల్చి, గుంటూరు నుంచి మనిషి వచ్చారని, సుధాకరం మాట్లాడుతున్నారనీ చెప్పారు.

కాబోయే పెళ్ళివారి దగ్గరనుంచి మనిషిరావటం యెవరికీ ఏమంత ఆశ్చర్యం కల్గించలేదు. అందులో అయినవారు, రెండుప్రక్కలా కావాల్సిన వాళ్ళూ ఏ కబుర్లయినా వుండవచ్చు. కాని శాంత లేచివెళ్ళింది.

పది నిమిషాలు గడిచిపోయినాయి. గాజులబత్తు నీలిరంగు గాజు

తీసి సుజాత చేతి కెక్కిస్తున్నాడు. ఇంతలో బయటనుంచి శాంత హడా వుడిగా లోపలికి వచ్చి "ఇదుగో ఆపు, వేసినవి చాల్లే" అంది. "ఏమిటదీ? ఎందుకూ?" అదోరకంగా మారిపోయిన శాంత మొహంలోకి చూస్తూ ఎవరో ఆదుర్దాగా అడిగారు.

"ఆపేసెయ్యి. పెళ్ళి ఆగిపోయిందట మనిషి వచ్చాడు." సుజాత పులిక్కిపడి వెనక్కి తిరిగి చూసింది నీలంగాజు ఎక్కిస్తున్న గాజుల బత్తు కూడా యెక్కిస్తున్న గాజు సగంలో ఆపేసి గుడ్లు పెట్టుకుని చూస్తుండిపోయాడు.

"క్షమించండి, పిల్లవాడి తల్లికి ఒంట్లో బాగాలేదట. మమ్మల్ని ఉన్నపళంగా బైలుదేరి రమ్మని కబురు వచ్చింది. సుజాతా! నువ్వు లేచి లోపలికివెళ్ళు." ఎలాగో గబగబా అనేసి శాంత లోపలకువెళ్ళిపోయింది. వచ్చినవాళ్ళంతా ఒకళ్ళ మొఖాలు ఒకళ్ళు చూసుకున్నారు.

మరో అరగంటలో శాంత కోరికమీద యిల్లంతా ఖాళీ అయిపో యింది. వచ్చినవాళ్ళంతా తలోవిధంగా గుసగుస లాడుకుంటూ వెళ్ళి పోయారు.

"వదినా! అత్తయ్యకేమైంది?" గబగబా పెట్టెసర్ది తలుపులు వేసి ప్రయాణానికి సిద్ధమవుతున్న వదినగార్ని అడిగింది సుజాత.

"అత్తయ్య కాదమ్మా, బావకే బాగుండలేదట ! మరి ఎంతవరకు నిజమో! నువ్వు ఖంగారుపడకు. ముందా వేషంతీసేసి మామూలు బట్టలు వేసుకురా! సుజాతమీద తన మాటలు యెలా పనిచేశాయో గమనించ కుండానే వెళ్ళిపోయింది శాంత.

వేషమా? పొద్దుట్నుంచి తన్నప్రాణాలుతీసి వద్దుమొర్రో అంటున్నా వినకుండా కేకలేసి బుజ్జగించి బలవంతానకూర్చోపెట్టి చేసిన అలంకరణ వేషమా? అసలు బావ కేమైంది?

సుజాత ప్రశ్నలకి ఎవరూ సమాధానం చెప్పలేదు.

ఆరాత్రే అందరూ వచ్చినమనిషితో గుంటూరు బైలుదేరివెళ్ళారు. ఆ బైలుదేరడంలో తన మొహాన అదృష్టవంతురాలు అనే పదం తుడి చేసుకోవడానికి వెడుతోందని సుజాతకి తెలియదు. వచ్చిన మనిషి మధు ఆ ఉదయం గుండె ఆగిపోయి మరణించాడని చెప్పలేదు. వెళ్ళగానే చావు

కబురు వినాల్సివస్తుందని సుధాకర్ కల్లోగూడా ఊహించలేదు. అదే మాత్రం ఊహకి అందినా వెంట చెల్లెల్ని, భార్యని తీసుకెళ్ళేవాడు కాదు.

వాకిట్లో వాళ్ళని చూస్తూనే విశాలక్షమ్మగారు - శోకంతో శివం ఎత్తినట్టయింది. చెట్టంత కొడుకు హఠాత్తుగా గుండె ఆగి చచ్చిపోయి శవంగా మారిపోతే ఆ శవాన్ని నిర్దయగా కాల్చిపారేస్తే ఈలోకం ఇంకా ఇలాగే వుండిపోవటం ఎందుకో ఆవిడకు అర్థం కావటంలేదు. కొడుకు చావుతో దాదాపు పిచ్చిదైన ఆవిడ సుధాకరాన్ని చూస్తూనే మీది కురికి "మీరే నా బిడ్డని పొట్టన పెట్టుకున్నారు. ఇదిగో ఈ రాక్షసి మూలంగానే వాడు చచ్చిపోయాడు" అంటూ సుజాతని చేయిపట్టి గుంజింది. అనుకోకుండా ఎదురయిన ఈ సంఘటనకి అంతా తెల్లబోయారు. సుజాత భయంతో అన్నగారి గుండెలకి బల్లిలా అంటుకుపోయింది. "నీ మొహానికి పెళ్ళటే? నీ మొహంలో వాడిచావు రాసిపెట్టుందని నాకు తెలుసు. అందుకే వద్దంటే వాడు విన్నాడా? ఇప్పుడు అనుభవిస్తున్నది ఎవరు? నీకేమే, నువ్వు రేపీపాటికి పెళ్ళిచేసుకుని బాగానే వుంటావు. అయినా పెళ్ళి ఎలా చేసుకుంటావో చూస్తాను. వాడు కూడా నా కొడుకుమల్లే మూడో నాటికి చావకపోతే నా పేరు విశాలాక్షమ్మ గాదు, చూడు" వడగళ్ళ వానలా ఆవిడ సుజాతమీద కురిపిస్తున్న శాపనార్థాలని వినలేక ఎవరో సుజాతని అక్కడ్నుంచి అవతలకు లాక్కుపోయారు.

ఆరాత్రికిరాత్రే భార్యనీ, చెల్లెలినీ, వెంటబెట్టుకుని బెజవాడ తిరిగి వచ్చేశాడు సుధాకర్.

జరిగిన ప్రయత్నాలు వృధాఅయ్యాయి. అనేకంటే చెల్లెలు జీవితం యిలా భగ్నమైపోయిందే అన్నబాధ ఎక్కువైంది సుధాకర్‌కి. జీవితం పక్కవాటుగా వచ్చి అనుకోకుండా కొట్టిన ఈదెబ్బకి సుజాత మనసు దిమ్మెరపోయింది. చాలారోజులవరకూ మతిపోయినదానిలా గదిలో అలా గంటలు గంటలు కూర్చుండిపోయేది.

రెండు సంవత్సరాలు యిట్టే గడిచిపోయినాయి. జరిగిన యీ సంఘటనకూడా పాతబడిపోయింది. శాంత ప్రోద్బలంతో మళ్ళీ సుధాకర్ సుజాత కోసం సంబంధాలు వెతకసాగాడు. విశాలాక్షమ్మగారు వేయి నాలుకలతో సుజాత దురదృష్టాన్ని చాటటం మానలేదు. ఒకటి రెండు

సంబంధాలు కుదరబోయి, యీ సంగతి తెలిసి వెనక్కు జంకినయి. రోజులుగడుస్తున్నకొద్దీ తనచెల్లెలు దురదృష్టవంతురాలు కాదని, దానితో జీవితం పంచుకునే అవకాశంలేని మదే దుర దృష్టవంతుడు అనిపించేలా సుజాత జీవితం చక్కదిద్దాలని సుధాకర్‌లో గట్టి పట్టుదల ఏర్పడింది. కాని ఎవరు ఎలా అనుకున్నా సుజాత మనసులో విశాలాక్షమ్మగారి తిట్లు శిలా రూపం ధరించాయి. ఆవిడబాధ తన పాలిట శాపంలా మారి జీవి తాంతం తను యెక్కడున్నా తనకి సుఖంలేకుండా చేస్తుందనే నమ్మకం ఏర్పడిపోయింది. అది తెలిసి ఇంకోవ్యక్తిని దానిక బలిచెయ్యటం సుజాత కిష్టంలేదు. అందుకే ఇవాళ అన్నగారితో అలా నిస్సంకోచంగా "నాకీ పెళ్ళి వద్దు" అని చెప్పగల్గింది.

సుజాత అదృష్టమో, దురదృష్టమో దానికి సవాల్ అంటున్నట్టుగా నిశ్చయమైన యీ సంబంధము చూస్తే సుధాకర్‌కి కూడా మతి పోయినంత పనయింది. పెండ్లికొడుకు శేఖరానికి వున్న డబ్బుకి, ఇన పెట్టెకి కాపలా అన్నట్టు ఒక్క ముసలమ్మ తప్ప ముందూవెనకా ఎవరూ లేరు. బోలెడంత ఆస్తితోపాటు మంచి సంస్కార హృదయం గూడా కలిగి వుండటం అతని ప్రత్యేక లక్షణం అన్పిస్తుంది. ఆడవాళ్ళకి చదువుకంటె అందం, అందంకంటె గుణంప్రధానం అనే మనిషిఅతను. విదేశాలకు వెళ్ళొచ్చి హైద్రాబాద్‌లోవున్న కంపెనీలో ఇంజనీరుగా పని చేస్తున్నాడు. అతనెంత ఆధునిక భావాలు గలవాడో వాళ్ళ బామ్మ అంత పాతకాలపుమనిషి. అటు బామ్మని తృప్తిపరుస్తూ ఇటు తనని సంపూర్ణంగా అర్థం చేసుకోగల వ్యక్తి కావాలి అతనికి. కాని ఎంత వెతికినా అటో ఇటో తప్ప అలాటి మధ్యరకం మనుష్యులు దొరకటంలేదు. వెతికి వెతికి విసిగిపోయిన అతను అసలు బామ్మ బ్రతికున్నన్నాళ్ళు పెళ్ళే చేసుకోకూడదనే నిర్ణయానికి వచ్చాడు.

సుధాకరం స్నేహితుడయిన రంగధామానికి శేఖరం గూడా కావాల్సినవాడు. ఏదో మాటలమీద ఓసారి హైద్రాబాద్‌లో కలుసుకున్నప్పుడు యిలా తన స్నేహితుడి చెల్లెలు వో అమ్మాయి వుందని, ఒక్కపిల్ల, చాలా బాగుంటుందనే విషయం తప్పిస్తే యిహ ఏ విషయంలోను శేఖరంతో సరితూగలేరని కూడా చెప్పాడు. బెజవాడవెళ్ళి చాలా సంవత్సరా

లయింది. ఓసారి చూసినట్టు ఉంటుంది, పెళ్ళి కూతుర్ని చూసినట్లూ ఉంటుందనుకున్న శేఖరం చూడటానికి వస్తానని కబురుచేశాడు. శేఖరం స్థితిగతులు రంగధామం వర్ణించి చెబుతుంటే సుధాకరం ఊ అనికాని ఆ అనికాని అనలేదు మరీ అంత పైగావున్న సంబంధం అతని ఊహ కందనిది. కాని రంగధామం పట్టువదలలేదు. శేఖరాన్ని తీసుకొచ్చాడు. సన్నగాపొడుగ్గా రివటలా వున్న సుజాత క్షణంసేపు శేఖరం కనులలోకి చూసి అవి తనవైపే ఆసక్తిగా చూస్తున్నాయని గ్రహించి వెంటనే కనులు ప్రక్కకు తిప్పేసుకుంది. ఆ తిప్పేసుకోవటంలో శేఖరం మనసుకూడా ఆ చూపుల వెంబడి వెళ్ళిపోయిందనే చెప్పాలి. స్వదేశం లోనూ, విదేశాల్లోనూ శేఖరం చాలామంది అందమైన ఆడవాళ్ళని చూశాడు గాని ఇలా చాలా సాధారణంగా ఉన్నట్లుండి ఒక్కచూపుతో పదేవదే తనవైపు చూసేలా చేసే మహా సౌందర్యాన్ని యెక్కడా చూడ లేదు. ఉన్న అరగంటలో శేఖరానికి సుజాతవైపునుంచి కనులు తిప్పు కోవటం చాలా కష్టమే అయింది.

చూసి వెళ్ళగానే ఆ సాయంత్రమే రంగధామంచేత కబురు చేశాడు పిల్ల నచ్చిందని, మిగతా విషయాలువచ్చి మాట్లాడమని శేఖరం మిగతా విషయాలు అనటంలో గల ఉద్దేశ్యం లగ్నం యెప్పుడు వీలుగా వుంటుంది? పెళ్ళి యెక్కడచేసారు? అని మటుకే. ఆ విషయాలు సుధా కర్ శక్తి సామర్థ్యాలకి వదిలేశాడు. సంబంధం ఔనసుకుని యింటికి వచ్చే సుంటే సుధాకర్‌కి మతిపోయినంత పనయింది. తను చేసింది తనకే నమ్మకం ఏర్పడటంలేదు సుజాత శేఖరంలాంటి వాడిని పొందబోతోంది అంటే అతనికి వూపిరి పీల్చటానికిగాని ఈ విషయం ఇంకొకళ్ళకి చెప్పాలి అనిగాని అనుకోవటంగూడా భయంగా వుంది. అందుకే ఈపెళ్ళి విషయం ఎవరో మరీ ముఖ్యులు అనుకున్నవాళ్ళకి తప్ప బంధువులందరికీ తెలియ పరచలేదు. విశాలాక్షమ్మగారికి అసలు కబురే తెలియకుండా జాగ్రత్త పడ్డాడు.

చాలా స్వల్ప వ్యవధిలో లగ్నం నిర్ణయింపబడింది. శేఖరం బామ్మగారు వచ్చిపిల్లని చూసుకుని సంసారపక్షంగా వుందని తృప్తిపడి వెళ్ళిపోయింది.

పెళ్ళి పనులు చాలా నిరాడంబరంగానే ప్రారంభమైనా శాంతకి సందడి తప్పలేదు. ఈ సందట్లో అసలెవరూ సుజాత గొడవ పట్టించు కున్నట్టే లేదు. తనకీ పెళ్ళి యిష్టంలేదని మొదట్లో వదినగారికి చెప్పాలని సుజాత చాలా ప్రయత్నించింది. కాని అవకాశం చిక్కలేదు. ఓ చెంప లగ్నం దగ్గర పడిపోతోంది. ఏ సమయంలో యెలాటి కబురు వినాల్సి వస్తుందో అని సుజాత శరీరంలో నరనరం ఒణికిపోతోంది పెళ్ళి యేదో కారణంచేత ఆపేస్తే బాగుండు ననిపిస్తోంది. అందుకే యెలాగో అన్నగారికి చెప్పేసింది.

సుజాత మాటలు సుధాకరం చెవిని పడినట్టులేదు. అతను మామూలుగా ఉన్నాడు. మధ్యమధ్య మటుకు ఏదో గుర్తువచ్చినవాడిలా "శాంతా! సుజాత ఏదీ? చేస్తోంది?" అని మటుకు అడిగేవాడు. అలా అడగడంలో ఓ కన్నూ—చెవీ చెల్లెలివైపే వున్నాయని అర్థం అయేది. శాంత కసలు సుజాతవైపు కళ్ళెత్తి చూసే తీరుబడికూడా లేదు సుజాత అనుకున్నట్లు ఈ పెళ్ళి ఆగేట్లులేదు. ఉరిశిక్ష దగ్గర పడుతున్న ఖైదీ గుండెల్లా సుజాత బిగపట్టుకుని ఆ క్షణంకోసం ఎదురు చూస్తోంది.

అలా బిగపట్టుకుని చూస్తూండగానే ముహూర్తం దగ్గరపడింది. పెళ్ళికొడుకు తరలి వచ్చాడు. మంగళ వాయిద్యాలు మోగినాయి. ఇద్దరి మధ్య అడ్డుగా పురోహితులు పట్టుకున్న సన్నటి తెర జారిపోయింది. ఎదురుగా తెల్లగా, పొడుగ్గా, పసుపు బట్టలతో ఆరోగ్యంగా, బలంగా వున్న చేతుల్తో మంగళసూత్రం పట్టుకొని శేఖరం నిలబడ్డాడు క్షణం సేపు సుజాత కళ్ళెత్తి చూసింది. అతనికన్నుల్లో పెదవులమీద చిరుదర హాసం మెరిసింది. అప్పటికే నీరు నిండిన సుజాత కనులు క్రిందకి వాలిపోయాయి. పురోహితులు గొంతెత్తి మంత్రాలు చదివారు "సీతమ్మ పెళ్ళి కూతురాయెనే" అని బిగ్గరగా బ్యాండుమేళం పాడింది. శేఖరం చేతులు సుజాత మెళ్ళో మూడుముళ్ళు వేసినాయి. సుజాత చెవులకి మేనత్త తిట్లు శాపనార్థాలు వెయ్యి కంఠాలతో, మంత్రాల ఘోషలో విన్పించాయి. మిగతా తతంగం యెలాగో పూర్తి అయిందనిపించి తడబడుతున్న అడుగులతో, తూలుతున్న శరీరంతో సుజాత వదినగారి సాయంతో లోపలకు వెళ్ళింది.

భోజనాలయిం తర్వాత పూజగదిలో కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్న పెళ్ళికూతురి దగ్గరికి శేఖరం బామ్మగారు వచ్చి కూర్చుంది. ఆవిడ మొహం ఆనందంతో యింత చేసుకుని "వాడికీజన్మలో పెళ్ళే కాదనుకున్నానే అమ్మాయి! నాకేం తెలుసు-భగవంతుడు నిన్ను పుట్టించి యీ మారుమూల పెట్టాడని దానికోసం వెర్రిసన్నాసి దేశాలన్నీ గాలిస్తున్నాడని!" సుజాత అంటే ఆవిడకి ఎంత తృప్తి, సంతోషం కలిగాయో ఆనందంతో తెరుచుకున్న ఆ బోసినోరే చెపుతోంది.

"మళ్ళీ ఈ రోజులకి ముది మనవడ్ని యివ్వకపోయావంటే చూసుకో నీపని చెప్తా!"

బొమ్మలా కూర్చున్న సుజాత ఆవిడవైపు పెద్దపెద్ద కనులుచేసుకొని చూడసాగింది. రేపు శేఖరానికి ఏదన్నా అయితే యీావిడ మొహం యెలా మారుతుంది? ఇప్పుడు కన్పిస్తున్న ఈ సంతోషం-తన పాలిట మళ్ళీ శాపంగానో, ద్వేషంగానో మారిపోతుంది కాబోలు ఆలోచించిచూస్తే అదృష్టానికీ దురదృష్టానికి వెంట్రుకవాసి తేడా అంతే. అది గ్రహించిన వాళ్ళకే తెలుస్తుంది.

సాయంత్రం దంపతులిద్దరూ సుధాకర్‌కి నమస్కరించటానికి వెళ్లారు. వాళ్లు పొంతం వంగకుండానే ఇద్దర్నీ చెరోచేత్తో లేవదీస్తూ చెల్లెలి చేతిని శేఖరం చేతిలో పెడ్తూ "శేఖరం నాచెల్లెలి మనస్సు శరీరం కంటే సుకుమారం—అపురూపం గూడాను" అన్నాడు.

"అపురూపమైన వస్తువుల్ని ఎంత జాగ్రత్తగా చూసుకోవాలో నాకు తెలుసులే సుధాకర్" అన్నాడు శేఖరం నవ్వుతూ. అతనినవ్వు పరధ్యాసగా వున్న సుజాతని పట్టి యీలోకంలోకి తెచ్చి మరీ గిలిగింతలు పెట్టింది. దూరంగా నిలబడి ఎవరో "ఈడు జోడూ చక్కగా కుదిరింది. కన్నుల పండువుగా వుంది" అనటం విని సుజాత చటుక్కున తలతిప్పి అటువైపు చూసింది.

చూస్తుండగానే కలలోలా అన్నీ జరిగిపోయాయి.

శేఖరానికి ఎక్కువగా శలవులు లేకపోవటంవల్ల వెంటనే వెళ్ళిపోవాల్సి వచ్చింది. ఆ రాత్రి సుజాతని దగ్గరకు లాక్కొంటూ "పెళ్ళికూతుళ్ళని వెతుక్కోవటంలోనే నా శలవులన్నీ కరిగిపోయాయి. తీరా

పెళ్ళికూతు రొచ్చేసరికి శలవే లేదు చూడు!" అన్నాడు నవ్వుతూ.

ఎక్కడో పుట్టి,యెక్కడెక్కడో ప్రవహించి, మారుమూలగావున్న సముద్రాన్ని వెతుక్కుని, అందులోకి వెళ్ళి ఐక్యమైపోయిన మహానదిలా సుజాత శేఖరంలో కలిసిపోయింది. నిన్నటి సుజాత బెరుకుతనం, సంకోచం అన్నీ పోయినాయి. అతని ప్రక్కన నిలబడి ఏదో అందమైన అనుభూతి తప్ప యింకేం కన్పించలేదు.

"ఉండుండి అలా ఏదో పోగొట్టుకోబోతున్న దానిలా బేలచూపులు చూస్తావేం?" సుజాత భుజాలచుట్టూ తన చేతుల్తో పెనవేస్తూ అడిగాడు శేఖరం.

"ఇన్నాళ్ళు ఈఅమ్మాయి లేకుండా నేనెలా గడిపాను?"అని అన్పిస్తోంది అతనికి అతని ప్రతికదలికలో, ప్రతి స్పర్శలో సుజాతపట్ల అనురాగం తొణికిసలాడుతోంది.

"మాట్లాడవేం? నిన్ను నాతో తీసుకెళ్ళిపోవాలను కుంటున్నాను. రావటానికి నీకిష్టమేనా? ఎందుకలా చూస్తావు? నేనేం నీలా బొమ్మలా లేనుగా ?" తన జుట్టువంక, పెదవులవంక పరిశీలనగా కన్నార్ప కుండా చాలా సేపటినుండి చూస్తున్న భార్యని వంగి కళ్ళమీద ముద్దు పెట్టుకుంటూ అన్నాడు. సుజాత చప్పున కళ్లు మూసుకుంది. అతని పెదిమలకుండే స్పర్శ కళ్ళను తాకి లోపల నరాల్లోకి విద్యుత్తులా ప్రవహించినట్లుగా వుంది సుజాతకి.

"ఈ కళ్ళే నన్ను ఆకట్టుకున్నాయి. నీ మనసు దేనికి స్థానమో నేనింకా గ్రహించలేదు కాని-కళ్ళు మటుకు అందాలకి ఆలయాలు. చూడు, నాకు తెలియని భావాలకి భషగూడా నేర్పుతున్నాయి" నుదుటి మీద పెదవుల్తో తాకుతూ అన్నాడు.

"ఛ! కాటుక!" సుజాత చప్పున కొంగుతీసి శేఖరం పెదవులకు అంటిన కాటుక తుడిచేసింది.

ఆరాత్రి తన్నెలా సమాధానపరచాలో-బామ్మగారినెలా సంతృప్తి పరచాలో వివరంగా సుజాతకి కొత్త జీవితాన్ని గురించి పాఠాలు చెప్పాడు శేఖరం. అతను చెపుతున్న ప్రతిమాటని శ్రద్ధగా ఆలకించింది సుజాత.

మర్నాడు సుజాతని తీసుకెళ్ళాననన్న శేఖరాన్ని చూసి "ఇంత త్వరగానా! ఒక్క నెల రోజులుంచగూడదూ? పోనీ కనీసం 29 రోజులు" అడగలేక అడగలేక అడుగుతున్న సుధాకరాన్ని చూసి శేఖరం ఏమను కున్నాడో 15 రోజుల తర్వాత వచ్చి తీసుకెడతానని చెప్పి వెళ్ళి పోయాడు.

వచ్చిన చుట్టాలంతా వెళ్ళిపోయారు. ఇల్లంతా నిశ్శబ్దంగా అయిపో యింది. పెళ్ళి తాలూకు సువాసనలు ఇంకా యింటిని వదిలిపోలేదు. ఏ మూల చూసినా పెళ్ళి తాలూకు యేదో చిహ్నం కన్పిస్తోంది. సుజాత మనసులో భావాలు ద్వంద్వయుద్ధం మొదలుపెట్టినాయి. ఒక్కోసారి ఇదంతా అబద్ధం,తనేదో భ్రమలోపడి కొట్టుకుపోతున్నాననిపిస్తోంది. కాని మరుక్షణంలోనే శేఖరంతో గడిపిన క్షణాలు అనుభూతులుగా మారి మనసంతా ఆనందడోలికల్లా వూగుతానంటున్నాయి. తన వేలికున్న దానిమ్మగింజ రంగు రాయి ఉంగరం చూసినప్పుడల్లా అందులోంచి నవ్వుతున్న శేఖరం మొహం కన్పిస్తోంది.

శేఖరం వెళ్ళిన మూడోరోజునే ఉత్తరం వచ్చింది. అందులో తన కేం తోచటంలేదని, క్షణం యుగంలా వుందని, ఏ నిముషంలోనైనా వచ్చి వెయ్యగలననీ రాశాడు. సుజాతకి అతని ఉత్తరం మరీ కొత్త లోకం ఏర్పరచింది.

"ఏమ్మా? ఈ పెళ్ళి అసలు వద్దే వద్దన్న మనిషివి గదూ! అలా తహతహలాడిపోతున్నావు?" నాలుగోరోజు మళ్ళీ ఉత్తరం కోసం ఎదురు చూస్తున్న సుజాతని శాంత వెక్కిరించింది.

"పో వదినా!" తెచ్చిపెట్టుకున్న కోపంతో సుజాత అక్కడ్నుంచి లేచి వెళ్ళిపోయింది. కాని లేచి ఇవతలకు వచ్చేసిన వెంటనే మనసు ఎలాగో అయిపోయింది. తనా అఘాతందాటి వచ్చెయ్యలేదూ? వచ్చేసే గదా శేఖరం చేయిఅందుకుంది ఏమో! ఎవరు చ్పగలరు? ఈసంతోషం ఈ పట్టలేని ఆనందం దేనికన్నా సూచనలేమో! చూస్తుండగానే సుజాత మొహం వివర్ణమైపోయింది. అసలు శేఖరాన్ని పొందకుండా వుంటే అదో మాటగాని ఒకసారి పొంది మళ్ళీ పోగొట్టుకోవాలంటే? క్షణంసేపు సుజాత గుండెలు తెలియని భయంతో వణికినాయి.

"ఎక్కడా నువ్వు? ఇదుగో వుత్తరం వచ్చింది. బయటికి రా-" బయటనుంచి విన్పిస్తున్న శాంత మాటలకి సుజాత హృదయం ఎగిరి గంతేసింది. కాని ఆ చైతన్యం శరీరంలోకి రాకుండా జాగ్రత్తపడి మామూలుగా మెల్లగా యివతలకు వచ్చింది.

గదిలోకి వచ్చేసి కూర్చుని ఉత్తరాన్ని ఒకటి రెండుసార్లు చదువు కుంది. అందులో సారాంశం — బామ్మగారుకూడా సుజాతని తీసుకు రమ్మనమని గోలచేస్తోందిట. తనకి ఏమీ తోచటంలేదుట. శనివారం రాత్రికి తన స్వంత కారులోనే వచ్చేస్తున్నాట్ట. తిరిగి సోమవారం ఉదయం యిద్దరూ కలిసి హైద్రాబాద్ వెళ్ళిపోవాలిట. అదేవిషయం సుధాకర్‌కి వ్రాస్తున్నానని రాశాడు. దోవలో తను ఎక్కడెక్కడ ఆగేది, ఏ ఏ చోట్ల సుజాతని గురించి ఆలోచించేది వివరంగా గుర్తుపెట్టుకుని వచ్చేటప్పుడు ఆయాచోట్లు చూపిస్తానవి రాశాడు. ఉత్తరం చాలా వివ రంగా విశేషాలతో, అలంకారాలతో మృధుమధురంగా వుంది.

అసలు దేనికోసమూ యెదురు చూడగూడదు. అలా చూడటం మొదలు పెడితే కాలమే ఆగిపోయినట్లనిపిస్తుంది. సుజాతకి జన్మలో శని వారం అనేది రాదనిపించింది. ఎలాగయితేనేం వచ్చింది. సాయంత్రం అవనూ అయింది. స్నానంచేసి బట్టలు వేసుకుని అలంకరణకోసం నిలువుటద్దంముందు కూర్చున్న సుజాతకి అద్దంలో తన ప్రతిబింబానికి బదులు శేఖరం మొహం కన్పించి చిలిపిగా నవ్వి కవ్విస్తోంది. అతను తనెదుట లేకపోయినా అతన్ని ప్రత్యక్షంగా చూస్తున్నట్లుగానే వుంది. ఒక్కోసారి ఊహ మనిషిని ఎంత పిచ్చివాడ్ని చేస్తోంది!

జడ వేసుకోవటం పూర్తయి ఒకసారి పెట్టుకున్న పూలే సరిగ్గా కుదరలేదని తీసేసి మళ్ళీ పెట్టుకుంటుండగా వెనక నుంచి శాంతవచ్చి "ఏవమ్మోయ్ యింకా నీ సింగారం పూర్తికాలేదా? అతనికి అన్నంలోకి యేం చెయ్యమంటావు?" అంది.

"పో వదినా! నాకేం తెలుస్తుంది?" కృత్రిమ కోపంతో పెదవులు ముడుచుకుంటూ అంది సుజాత.

"లేకపోతే నాకు తెలుస్తుందా? మరి గంటలు గంటలు గదిలో కూర్చొని చెప్పుకున్న ఆ కబుర్లన్నీ ఏమిటో?"

సుజాత ఫక్కుమని నవ్వింది. "బావుంది. అయితే నీకేం కూర యిష్టం, ఏ పులుసు యిష్టం—ఇవేనా కబుర్లు?"

"కాక? ఏమోనమ్మా! నాకేం తెలుస్తుంది? మీ అన్నయ్య నన్ను మొట్టమొదట అడిగినమాట నీకు గుత్తివంకాయ కూర వచ్చునా? అనే" గాంభీర్యం తెచ్చిపెట్టుకుని అంటున్న వదినగారి మాటలకి సుజాత కిలా కిలా నవ్వేసింది. ఖంగుమన్న ఆ నవ్వులో మనసులో పొంగుతున్న సంతోషం కట్టలు తెంచుకుని ప్రవహిస్తోంది.

"ఏమిటి వంకాయకూరఅంటున్నావు?" అప్పుడే సుధాకర్ లోపలికి వస్తూ అడిగాడు.

"ఏం లేదు. అన్నంలోకి ఏం చెయ్యాలో సుజాతని సలహా అడుగుతున్నాను." శాంత లోపలికి పారిపోయింది.

"ఓహో! ఇదెప్పటినుంచి?"అన్నాడు సుధాకర్. వస్తున్న నవ్వు పైట చెంగులో దాచేసుకోవటానికి ప్రయత్నిస్తున్న చెల్లెలివంక చూస్తూ.

"ఏమ్మా? నీ పనికాలేదూ? ఆయన వచ్చేవేళయింది. ఇంకో గంటలో వచ్చెయ్యవచ్చు" అంటూ అతను బయటికెళ్ళిపోయాడు.

సుజాత మళ్ళీ అద్దంవైపు తిరిగింది. ప్రతిబింబంతో మళ్ళీ సంభాషణ మొదలైంది. అవును వదినమాటలు నిజమే. ఈసారి అతనికి ఏమేమి యిష్టమో అన్నీ అడగాలి. రంగులుకూడా. ఏ రంగు చీరలు ఇష్టమో తెలుసుకోవాలి. తెలుపు అతనికి ఇష్టం వుంటుందో! ఉండదో కట్టుకున్న తెల్లచీరవంక చూసుకుంటూ అనుకుంది.

ఎలాగో 7 గంటలు అయింది. గడియారం గంటలు కొట్టింది. సుజాతకి హెచ్చరిక చేసి, మళ్ళీ తన పని చూసుకోసాగింది. ఆ గంటలు విన్నప్పట్నుంచి సుజాతకి కూర్చోబుద్ధి కావటంలేదు. మాటిమాటికీ బయటికి తొంగిచూస్తూ కారు హారన్‌కోసం ఒళ్ళంతా చెవులు చేసుకుని వింటూ ఇంట్లో అటూ ఇటూ తిరగసాగింది. తలనిండా సువాసనల్ని విరజిమ్ముతున్న మల్లెపూలతో, వాటికి పోటీపడుతున్నయా అనేంతటి తెల్లటి బట్టలతో, కళ్ళనిండా మెరుపులు కురిపిస్తూ ఏదో తెలియని చైతన్యంతో కదిలిపోతూ అటూ ఇటూ తిరుగాడుతూన్న సుజాతనిచూస్తుంటే సుజాతలో ఇంత సౌందర్యం ఉందా అని శాంతకే ఆశ్చర్యం వేసింది.

మాటిమాటికీ గడియారం చూస్తూ బైటకు అసహనంగా చూస్తున్న ఆడబడుచుని వేళాకోళం పట్టించాలనిపించింది శాంతకి.

"ఏమిటీ, అలా కాలుగాలిన పిల్లిలా ఇల్లంతా కలియ తిరుగుతున్నావు? ఆ మాత్రం ఆలస్యం కాకపోతే అందం ఏముందిలే-అసలింతకీ బయలుదేరాడో లేదో!"

"ఛీ! ఛీ! అలా అనకు వదినా! నాకు ఉత్తరం రాసి ఎలారాకుండా వుంటారు?" ప్రపంచంలో ఇదెక్కడన్నా సంభవమా అన్నట్లు చూసింది సుజాత.

"ఏమో, మామూలు మనిషా-అనుకోగానే బయలుదేరేందుకు? అధికారంగల ఆఫీసరయ్యే-ఏ క్షణంలో ఏ అవసరం అయినా రావచ్చు-ఆగిపోవచ్చు."

"పో వదినా! అవున్లే,నీకు తమాషాగా వుందికదూ?సర్లే. నిజంగా రారేమో- నీ వంటలన్నీ తీసుకెళ్ళి అవతల పారెయ్యి. పాపం, ఇందాకట్నుంచి కష్టపడి చేశావు."కోపంగా సుజాత అక్కడనుంచిలేచిపోయింది.

"బావుంది. ఆయనగారు రాకపోతే మా నోళ్ళేమైనాయి? మధ్య మమ్మల్ని వస్తులు పడుకోమన్నావా ఏమిటి?" శాంత నవ్వుతూ వెళ్ళిపోయింది.

వదినగారి దగ్గర్నించి లేచి వచ్చేసిన సుజాతకి అనుకోకుండా కళ్ళలో నీళ్ళు తిరిగాయి. నిజమే! ఒకవేళ అతను నిజంగా రాకపోతే?వస్తాడని మనసు గట్టిగా చెపుతోంది. ఏమో, వదినన్నట్టు హఠాత్తుగా-సుజాతకి ఆరాత్రి నిశ్శబ్దం-తనలా ఎదురు చూడటం అంతా చప్పగా అన్పించింది. ఏదో తెలియని నీరసం గుండెల్లో ప్రవేశించి,ఉత్సాహాన్నంతా లాగేసింది. అసలివాళ తనింత అలంకరణ చేసుకుందెందుకు? అన్నయ్యా-వదిన చూస్తున్నారనే సిగ్గుకూడా లేకుండా-ఛీ-ఛీ- తను సామాన్యంగా యెందుకుండలేదు? ఒకవేళ అతనొస్తే ఏ అలంకరణా లేక ఉదాసీనంగా వున్న తననిచూసి ఏమనుకుంటాడు? నే రావటం అనేది ఈఅమ్మాయికి ఏమంత గొప్ప విషయంగా లేదు కాబోలు అనుకోడూ? వస్తూనే మొదటి చూపులోనే అతని మనసు నొప్పించటంకాదూ! తల్లోంచి వద్దు, తీసేద్దాం అను

కుంటున్న పూలని, సుజాత చేతులు ఈ ఆలోచన రాగానే మళ్ళీ అలాగే వుంచేశాయి.

ఇంతలో వాకిట్లోంచి "సుధాకరం!" అన్న పిలుపు విన్పించింది.

"ఎవరు?" అంటూ యివతలకు వచ్చింది సుజాత.

వచ్చింది రంగధామం. "అన్నయ్య వున్నారమ్మా?" అన్నాడతను క్రొత్త అలంకరణతో రాత్రిరాణిలా మెరిసిపోతూ వచ్చి గుమ్మంలో నిలబడిన సుజాతని చూస్తూ.

"ఉన్నారు, పిలుస్తాను, కూర్చోండి." వరండాలోవున్న కుర్చీ చూపించి వెనక్కి తిరిగి లోపలకు వచ్చేస్తుండగా "ఎవరు?" అంటూ ఇంతలో సుధాకరమే బయటకొచ్చాడు.

"కాలేజీకి ట్రంక్ కాల్ వచ్చిందోయ్! శేఖరం కారు యాక్సిడెంట్ అయిందట!"

ముందుకుఅడుగువేస్తున్న సుజాత చటుక్కున ఆగిపోయి గిర్రున వెనక్కి తిరిగింది.

"బెజవాడకి 30 మైళ్ళ దూరంలోనే! కారేదయినా పంపించాలి"

"కారా? యాక్సిడెంటా? శేఖరం సంగతేనా నువ్వు చెప్పేది?" ఖంగారుగా అన్నాడు సుధాకరం.

గుమ్మందాకా వచ్చిన సుజాత స్థాణువులా నిలబడిపోయింది. ప్రపంచం అంతా గిర్రున తిరిగినట్టయింది. ఏదో తెలియని శక్తి సుజాతని తేలిక చేసేసి భూమ్మీదనుంచి ఆకాశంలోకి విసిరేస్తోంది. శూన్యంలో గిర గిర తిరుగుతున్న సుజాతనుంచి తల్లో పూలు, ఒంటిమీద బట్టలు విడి పోయి భూమ్మీదకి రాలిపోతున్నాయి. గుమ్మాన్ని చేత్తోగట్టిగా పట్టుకున్న అన్నగారు తృళ్ళిపడి గబగబ వెనక్కి వచ్చి, పడబోతున్న తనని చేతులతో పట్టి ఆపటంగా, అవేవీ తెలియదు.

సుజాతకి మళ్ళీ మెలుకువ వచ్చేసరికి తను మంచంమీదున్నట్టుగా, యెవరో తలవైపు కూర్చుని తనమొహం మీదికి వంగి ఆదుర్దాగా పరిశీలిస్తున్నట్లుగా తోచింది. "వదినా!" అస్పష్టంగా వున్న పొరల మధ్య తళుక్కుమన్న ఒంటిరాయి ముక్కుపుడకను చూసి తన దగ్గర కూర్చున్నది వదినగారని గ్రహించి సుజాత మెల్లగా నీరసంగా అంది.

"మెలకువ వచ్చిందా" మృదువుగా అడిగింది శాంత.

తనకేమైంది? సుజాతకి గుర్తొచ్చింది -యాక్సిడెంట్ అయిందనీ ట్రంక్ కాల్ వచ్చిందనీ మరో కారు పంపించాలనీ చెబుతున్నాడు. మరి, కారు పంపించాలంటే మనుష్యులు బాగా గాయపడ్డారన్నమాట! శేఖరానికి యెలావుందీ? తనెవర్ని అడగాలి?

"పూర్తిగా మెలకువవస్తే-లేచి కొంచెం వేడివేడి కాఫీ తాగు ఖంగారు పడకు. అన్నయ్య కారుతీసుకునివెళ్ళి చాలా సేపైంది. ఈపాటికి తిరిగి వచ్చేస్తుండవచ్చు." సుజాతకు ధైర్యంచెపుతున్నట్టుగా దగ్గరకు వంగి చెప్పింది.

"చాలా సేపయిందా వెళ్ళి అన్నయ్య?" అస్పష్టంగా అంది సుజాత! అంతకంటే ఏం అడగాలో తోచలేదు. తన దురదృష్టాన్ని ఈపాటికి కారులో వేసుకుని సుధాకరం తిరిగి వస్తూండవచ్చు.

"ఊఁ!" అంతకుమించి చెప్పదల్చుకోలేదులా వుంది శాంత. "నువ్వు లేచి కాఫీతాగు కాస్త ప్రాణం వచ్చినట్టుంటుంది"సుజాతకళ్ళనుంచిప్రక్కలకి వెచ్చగా కారిపోతున్న నీళ్ళనిచేతో తుడుస్తూ అందిశాంత. తనమనసు గూడా యెలాగో వుంది. ఇందాక తమాషాకి అతను రాలేదేమో అని తను ఎగతాళి చేసింది. ఎన్నడూలేంది తననోటినుంచి అలాటి పరిహాసం యెందుకొచ్చిందివాళ?

సుజాత లేచి కూర్చుంది.

"ఇంకా సేపు పడుకో, అప్పుడే లేవకు" అంటూ వారిస్తున్న వదిన గారిని లక్ష్యపెట్టకుండా "నేనప్పుడే ఈ పెండ్లి వద్దని చెప్పలేదూ? మీరెవరూ నా మాట వినలేదు. నాకుతెలుసు. అత్తయ్యమాట అక్షరాలనిజం అవుతుందని" హఠాత్తుగా మోకాళ్ళమధ్య తల దించుకొని ఏడవటం మొదలు పెట్టింది సుజాత.

"ఇది మరీబాగుంది. ఏమిటా పిచ్చిమాటలు?" మందలించింది శాంత.

"మొదట్నుంచి నా మాటలు మీ రలాగే తోసేశారు. నాకు తెలుసు వదినా! నా క్షోభ, నా భయం మీరిప్పుడు ఆలోచించలేరు. లేకపోతే

(10)

ఇన్ని దేశాలు కారులో తిరిగిన మనిషికి ఈయాక్సిడెంటు ఏమిటి? నాదురదృష్టం కాకపోతే! నువ్వు-అన్నయ్య కలిసి అతన్ని మోసంచేసి నన్ను అతనికి అంటగట్టారు." వెక్కిళ్లతో సుజాత పక్కలు కదిలిపోతున్నాయి.

అర్థంలేని ఈ మాటలకి ఏం జవాబు చెప్పాలో శాంతకి తోచలేదు. అవతల గదిలోంచి పిల్లాడి ఏడుపు విన్పించటంతో లేచి వెళ్ళింది. ఒంటరిగా శూన్యంలో మిగిలిపోయిన సుజాతకి దుఃఖం మరింత కట్టలు తెంచుకొని ప్రవహించింది. ఎన్ని అనుకుంది తను? అతనికి ఎన్ని చెప్పాలనుకుంది. ఈ పదిరోజులలో అతనితో తను గడపబోయే జీవితాన్ని గురించి ఎన్ని కలలు కంది? అసలు పెళ్ళయింతర్వాత అతని వెంట వుండకుండా తను దూరంగా ఎందుకుంది? తనకోసం ఆత్రంగా పరుగెత్తుకొస్తూ పడిదెబ్బలు తినడం భగవాన్! రక్తపు మడుగులో తేలుతున్న శేఖరం సుజాత కళ్ళముందు మెదిలాడు.

ఇంతలో మళ్ళీ గదిలో అడుగుల చప్పుడు విన్పించింది. సుజాత తలెత్తకుండానే మరింత ఏడుస్తూ "వదినా! అన్నయ్య యింకా రాలేదేం! వెంట అసలు నన్ను తీసుకెళ్ళకుండా ఎందుకెళ్ళాడు? నేనేం చెయ్యను?" అంటూ అస్పష్టంగా అంది.

బలంగావున్న చేయి మృదువుగా సుజాత చేతిమీద పడింది.

"అన్నయ్యా!" ఆస్పర్శతో ఉలిక్కిపడి తలెత్తి చూసిన సుజాత కొయ్యబారిపోయింది. తను చూస్తున్నది వాస్తవమో, అబద్ధమో అర్థంకాలేదు. ఎదురుగుండా నలిగిన బట్టలతో, చెదిరిపోయిన జుట్టుతో, కొంచెం అలసటగా-అయినా నవ్వుతూ శేఖరం నిలబడి వున్నాడు.

"సుజాతా!" అతని కంఠం బరువుగా జీరగా విన్పించింది.

"మీరా?" ఇంకా తన కళ్ళు తనని మోసం చేస్తున్నాయేమో అనే అనుమానంతో తెల్లబోతూ రెప్పవాల్చకుండా అంది.

"నేనే! దాదాపు మృత్యుముఖంలోకి వెళ్ళి వెంట్రుక వాసిలో తప్పించుకుని బయటపడివచ్చాను" మంచంమీద కూలబడుతూ అన్నాడు శేఖరం. సుజాత అతని ఒళ్ళో వాలిపోయింది. ఒకవేళ యిది కలే అయితే! తన మతిభ్రమిస్తే అది శాశ్వతంగా ఉండిపోవాలనిపిస్తోంది

సుజాత మనసుకి.

"మీరేనా? మీరేనని-యిది నిజం అని చెప్పండి" శేఖరం చేతిని గట్టిగా రెండు చేతుల్లో పట్టుకుంటూ అంది.

సుజాత మాటలకిజవాబుగా శేఖరం తలనిమురుతూ వుండిపోయాడు. అతని కళ్లల్లో గూడా నీళ్ళు తిరిగాయి. ఎవరిదో కంఠం విన్పించటంవల్ల కాటోలు బాబుకి పాలిస్తున్న శాంత అలాగే లేచివచ్చింది. వస్తూనే గుమ్మం లోపల్నుంచీ కన్పిస్తున్న దృశ్యం చూసి తెల్లబోయి గబగబా పైటచెంగు సరిచేసుకుంది.

గుమ్మంలో కన్పించిన శాంతని చూసి శేఖరం నవ్వాడు. లేచి నిలబడటానికి వీల్లేనంత గట్టిగా పెనవేసుకుని ఒళ్లో వుంది సుజాత.

"నా కళ్ళని నమ్మలేకపోతున్నాను" అంది శాంత లోపలికి వస్తూ.

సమాధానంగా శేఖరం నవ్వుతూ "నేనూ అంతే, మిమ్మల్నంతా మళ్ళీ యిలా చూస్తాననుకోలేదు. అదృష్టంకొద్దీ బయటపడ్డాం గాని, కారు తుక్కు తుక్కు అయింది అన్నాడు."

శేఖరం చెప్పడం మొదలు పెట్టాడు. కారు కాశీగానే వస్తోంది కదా అని తెలిసినవాళ్ళు వస్తుంటే వాళ్ళని కూడా యెక్కించుకొచ్చాడట. అప్పటి వరకూ అతనే డ్రైవ్ చేశాట్ట. కొద్దిగా అలసటగా అన్పించి వెనక కూర్చున్న వాళ్ళలో డ్రైవింగ్ బాగా తెలిసిన అతన్ని స్టీరింగ్ తీసుకోమన్నాట్ట. అని తను వెనుక కూర్చున్నాడు. ఆ కూర్చోవటంలో బాక్ డోర్ సరిగ్గా పడలేదు. ఆ పడకపోవటమే శేఖరం క్షేమంగా తిరిగి రావటానికి కారణం అయింది. ఎదురుగుండా వస్తున్న లారీని తప్పించటానికి ప్రక్కకు తిరిగిన అతను రెండు సైకిళ్ళు అడ్డురావటంతో అవి రెండూ అడ్డదిడ్డంగా రోడ్డు మధ్య పరిగెత్తటంతో వాటిని తప్పించుకోవటంలో కారు వెళ్ళి ప్రక్కనున్న చెట్టుకి గుద్దుకుంది. అంతా క్షణంలో జరిగిపోయింది. వెనక కూర్చున్న శేఖరం, మరో అతను తలుపు సరిగ్గా పడకపోవటంతో విసిరేసినట్టు వెళ్ళి అంతా దూరాన పడ్డారు. డ్రైవింగ్ సీటులోకూర్చున్న అతను మటుకు చెట్టుకుగుద్దుకుని తల్లక్రిందులయిన కారులో యిరుక్కుపోయ్యాడు. అతనికి మటుకు బాగా గాయాలు తగిలినాయి.

శేఖరం చెపుతున్న దానిని సుజాత, శాంత యిద్దరూ ఊపిరి పీల్చటం మర్చిపోయి వింటున్నారు.

అదృష్టవశాత్తు అక్కడికో అరమైలు దూరంలో చిన్న ఊరు వుంది. అక్కడికి వెళ్ళి అక్కడున్న బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసులోంచి బెజవాడకి ఫోన్ చేశారు. సుధాకరం కారు తీసుకుని వచ్చేసరికు బ్లాక్ డెవలప్‌మెంటు ఆఫీసర్ మరి ముగ్గురి సాయంతో కారును సరిచేసి దెబ్బతిన్న అతన్ని యివతలకు లాగారు. అతనికి ఒంటిమీద స్పృహలేదుట, హాస్పిటల్లో చేర్చామని చెప్పాడు.

"వారేరి?" అంది శాంత, సుధాకరాన్ని గురించి అడుగుతూ.

"నాతోపాటు వెనక కూర్చున్న అతన్ని యింటిదగ్గర దించి కారు ఇచ్చేసి రావటానికి వెళ్ళాడు."

వదిన వచ్చింది. లేచి సరిగ్గా కూర్చోవాలని కాసేపు అన్పించింది సుజాతకి. కాని లేచేందుకు వోపికే లేకపోయింది.

ఇంతలో సుధాకర్ వచ్చాడు. "సుజాత లేచిందా! ఎలా వుంది?" అంటూ

"రంగధామం వచ్చి యాక్సిడెంట్ అయిందనగానే నిలబడ్డది నిలబడ్డట్టే విరుచుకు పడిపోయింది." శేఖరంతో అన్నాడు.

"అలాగా? నాకు చెప్పలేదు!"

"ఏం చెప్పమంటావు? నిన్ను సవ్యంగా చూసిన తర్వాత గాని నామతి నాకు తిరిగి రాలేదు" అంటూ శాంత వైపు తిరిగి "ఏవే? వేడినీళ్లు స్నానా నికున్నాయేమో చూడు. స్నానం చెస్తేగాని కాస్త ప్రాణంరాదు" అన్నాడు. శాంత లోపలికి వెళ్ళిపోయింది.

"అబ్బా! ఇవాళ లేచి యెవరి మొహం చూశామోగాని అందరం అదృష్టవంతులం."

"ఏదీ, మీ చెల్లెలు కాస్త కాఫీ అయినా యిచ్చిందా నాకు" అని "శాంతా!" అని పిలుస్తూ సుధాకర్ లేచి లోపలకు వెళ్ళాడు.

ఆ రాత్రి పడుకోబోతుండగా "ఇంకా యెందుకు అలా మాటి మాటికీ కళ్ళనీరు పెట్టుకుంటావు? నేను క్షేమంగానే తిరిగి వచ్చేశానుగా!" అన్నాడు శేఖరం సుజాతని దగ్గరకు లాక్కుంటూ.

"మీరు ఆడపిల్లయితే అప్పుడు తెలిసేది మీకు!" కన్నీళ్ళ మధ్య నవ్వుతూ అంది సుజాత.

"అబ్బో! అలాగా! నే నాడపిల్లయితే నువ్వు మగపిల్లాడుగా పుట్టవద్దూ మరి?" అన్నాడు శేఖరం.

"నిజంగా నా కేదో పీడకల జరిగిపోయినట్లనిపిస్తోంది." భర్త చేతుల్లో ఒరిగిపోయి గుండెల కంటుకుపోతూ అంది.

"నే నిలా తిరిగి రావటం కేవలం నీ అదృష్టమే సుజాతా. తిరిగి వస్తుంటే నా కదే అనిపించింది. భగవంతుడు ఎప్పుడూ చాలా మంచి వాడని బామ్మ అంటూ ఉంటుంది. ఇలాటి భార్యనిచ్చి జీవితం లేకుండా చేస్తే ఏమైపోవాలి నేను?" సుజాత నుదుటిమీద ముద్దు పెట్టుకుంటూ అన్నాడు.

"నిజమే! నేను అదృష్టవంతురాలినే! ఆ నమ్మకమే నాకు ఇప్పుడు ఏర్పడింది. ఇకనుంచి మీరు క్షణంగూడా నన్ను వదలవద్దు. మీరు ప్రక్క నున్నప్పుడు ఎంతో అందమైన భావాలని కలిగించే ఊహ మీరు లేకపోతే నాకు నరకాన్ని చూపిస్తుంది. నేనది భరించేలేను." ఆగి ఆగి అస్పష్టంగా అంది సుజాత, తనని బలంగా చుట్టేసిన భర్త చేతుల్లో మరింత ఒదిగిపోతూ.